# "కుయం మంత్రే యేంవితి యచ్మీ?"

## శ్రీ తెన్నేటి సూరి

"అచ్మీ! దో  బూచ్!"

"అయ్యయ్యయ్యో!  అరి వెధవా!" అంటూ కొంప మునిగిపోయినట్టు, పడమటింటి గుమ్మంలోనుంచి, ఒక్క గావుకేక బెట్టింది ముసలమ్మ— "మడిదణ్ణెం కాస్తా ముట్టుకుని తగులెట్టావూ? ఛీ! ఛీ! వెధవ కాపరం పిల్లణ్ణికూడా వదిలేసి, నాపసానుల్లా కచేరీలు తీర్చి కూర్చుంటే, వాక్కముండని యెందాకా యేడవను? మళ్ళా యీ గుడ్డలన్నీ తడుపుకు తగులడాలి; చస్తున్నాను నాకు చావన్నా రాలేదు."

"పిల్లణ్ణి ముందెట్టుకు కూర్చుంటే ఈ మైల చాకిరి అంతా ఎవరు తగలబెడతారూ" అంటు అందుకుంది కోడలు— "కచేరీలుట! కచేరీలు ఇక్కడెవ్వరూ కచేరీలు చెయ్యటం లేదు. ప్రొద్దుణ్ణించి రెక్కలు ముక్కలు జేసుకు చస్తున్నాను గుడ్డలు తడపమంటే తడపనా? ఇంతలోకే చావులూ బ్రతుకులూ యెందుకు ఇల్లా రావేంరా వెధవా! ఇంకా అక్కడే చచ్చావేం ఇలా రా! నీ దుంప తెగా! మాయదారి సంతానం అసలిక్కడి కెందుకు చచ్చావ్?"

'చెళ్లున' ఆ పసికూన లేత చెంపలమీద అయిదువ్రేళ్లూ బుసబుసా పొంగిపోయాయి.

"అయ్యయ్యో! ఎందుకమ్మా! పసిగుడ్డును అల్లా కొట్టావు?" అంటూ, చేతిలో వున్న నీళ్ళకడవ అక్కడ పారేసి, తల్లి చేతిలోనుంచి బిడ్డను బలవంతాన జారలాక్కుంది సుబ్బలక్ష్మిని కౌగిలించుకుని, బిడ్డ 'బావురు'మన్నాడు

తండ్రి, కాళ్లు గడుక్కోటానికి, దొడ్లోకి వచ్చాడు.

"పిల్లడు ఎందుకూ అలా ఏడుస్తున్నాడూ? ఎక్కిళ్లుకూడా వచ్చాయీ?"—

"నాన్నోయ్ మరే అమ్మే "ఒకదాని వెంట ఒకటి, ఎక్కిళ్ల, ఆపసిబిడ్డ పలుకుల్ని అడ్డగించి పారేసినయ్.

"కొట్టి చచ్చారూ? ..ఏముందీ ఆడి ప్రయోజకత్వం "—సుబ్బలక్ష్మి చేతుల్లో నుంచి బిడ్డను తీసుకున్నాడు—"పసిగుడ్డుమీద చెయ్యి చురుకు చూపించేకంటే అంత చేతులు దురదగావుంటే, కూర్చుని దేనికది నెత్తేనెత్తే కొట్టుకోటం మంచిది ఏది నాన్నా ఎక్కడకొట్టి చచ్చారూ?"

"ఇదుగో! " అంటూ, కందిపోయిన బుగ్గ చూపించాడు

"అరెరె! యేమిటీ పశుత్వం? లేత బుగ్గలమీద అయిదువ్రేళ్ళూ ఎలా కందాయో చూడు సుబ్బలక్ష్మీ! ..ఏముందీ గొడ్డుమోతు మనుష్యులు రెండువైపులా, రెండు కొంపలూ మృతనాష్టమై, పరాయివాళ్ళపరమైనాయి. ఈకొంపకూడా అలా కావలసిందే ఏదేవుడో కనికరించి, నలభై ఏళ్ళకి మళ్ళా పసిబిడ్డంటూ యీ కొంపకు యీ నలుసుని చూపించాడు. ఈ మనుషులు అసలు పశువులో, దున్నపోతులో అర్ధంకాదు ఏడవకు నాన్నా! ఇదుగో యీ తద్దినం కాస్తపూర్తి గానీ, ఆ దుసదునేమిటో కనుక్కుంటాను మా నాయన యేడవకు "

"మరే .అచ్మితో దూబూచ్ ఆలానసీ" మళ్ళా బిగ్గిరిగా యేడుస్తాడు.

"తగని చిత్తడి ఎల్లాగైనా. అల్లరి నేర్చుకుంటున్నాడు భోక్తలకోసం ఆరేసిన మడిగుడ్డలన్నీ ముట్టుకున్నాడు " అంది లక్ష్మి,

యజమానికి వచ్చిన కోపం కొంచెం చల్లారా లని

యజమాని మరీ మండిపడ్డాడు—

"ఓహో! అదా యేడుపూ! ముప్పై యేళ్ళు, ముద్దికింది కొచ్చేడిసినవాళ్ళకి, పసిగుడ్డును కొట్టుకోకూడదనే పరిజ్ఞానం లేదుగాని యీ నాలుగేళ్ళ నాసకి వీరి మళ్ళూ, వీరి ఆచారాలూ, వీళ్ళ శ్రాద్ధం ఈ ప్రపంచ విజ్ఞానమంతా వాడికి తెలియా లన్నమాట? మనుషులైతే బుద్ధీ, ఆలోచనా వుంటుంది పశువులకేముంది. ఏజన్మలోనో, యే దేవుడి పాదాలదగ్గిరో, ఒక తులసిదళం, తోచో తోచకో, పారేశాను. ఈ కాస్త సలుపూ భరించుతున్నాను. ఏడవకు నాన్నా! ఆసంగతి నేను కనుక్కుంటాగా సుబ్బలక్ష్మీ! భోక్తలు లేచేదాకా, పిల్లణ్ణి మీ యింటికి తీసుకుపో. మీపిల్లల్తో పాటు ఆడించు చిన్న నన్నాని. వాడికేం తెలుసు. ఇక్కడయివన్నీ ముట్టుకుంటాడు. మీరు వాడిమీద చెయ్యిచేసుకుంటే, నాకురేచి క్కొట్టుకొస్తుంది. చిట్టెమంతపనొస్తే చిందులు ద్రొక్కేడుస్తారు"

మెళ్ళో చిక్కుబడివున్న పులిగోరు పతకం సరిచేసి, బిడ్డను సుబ్బలక్ష్మి చేతుల్లోకి అందించాడు.

దొడ్డితలుపు తెరిచి "తలుపు వేసుకోండి" అని కేకబెట్టింది, సుబ్బలక్ష్మి ఇంటి వెనక వున్న పాటిదిబ్బ దిగుతోంది లక్ష్మి చంక నెక్కిన హుషారులో, తల్లి కొట్టిన దెబ్బ అప్పుడే మరచేశాడు - సంతోషంగా మాట్లాడటం ప్రారంభించాడు.

"అచ్చిమీ!—"

"ఆఁ!"

"బామ్మ అప్పాయి లొండుతోంది —"

"అవును. ఇవ్వాళ మీ తాతగారి తద్దినం గదూ —"

"తద్దినం అంటే యేవిటిఅచ్చిమీ?"

"ఇవ్వాళ మీ తాతయ్య వస్తారు."

'అచ్చోయ్! మొన్నే—మా మావయ్యొచ్చాలు"

"అబ్బే! ఛీ! తప్పు! అలా అనగూడదు, తాతయ్య రావటమంటే అది గాదు"

"కాదుయే! మావయ్య సైకిలెక్కొత్తాలూ తాతయ్యే ఎద్దులబండీ యెక్కొచ్చో. అహాహోయ్! అంతా వత్తాలు అచ్చిమీ' తాతయ్య యెవలూ?"

"మీ బామ్మ పెనిమిటి"

"పెనిమిటంటే మొగులా?"

"ఆఁ"

"అచ్చోయ్"—అంటూ లక్ష్మి రెండు భుజాలూ ఎట్టుకుని, ధీమాగా, ముఖంలోకి చూచాడు—ఏదో గొప్పవిషయం చెప్పబో తున్న దర్జాతో—

"ఇదిగో, అచ్చిమోయ్! ఈ తలవ గనప్పు, మా బామ్మ నన్ను కొత్తుతే తాతయ్యతో చెప్పి — యిత్తా — యిత్తా — యిత్తా— దుగ్గు దుగ్గు చేయిత్తాను"

"తప్పుగాదూ? పెద్దవాళ్ళని అలా అనొచ్చా?"

"తప్పా! అనగోల్దా? చెంపలేచుకోనా?" ఇరి చేతుల్తో చెంపలేసుకుంటాడు.

"మలీ చిన్నవాల్లని కొత్తతం, తప్పన్నాలుగా. నాన్నగాలూ, అమ్మా, బామ్మా నన్ను కొత్తుతాలుగదా చెంపలేచుకోలేం?—అచ్చిమీ! బుద్ధి! బుద్ధి! బుద్ధి! ఏక్కుయాయే! ఒకమ్మాయి బుద్ధి దొక్కిందే." అంటూ తాళవరుసలో పాటగా పాడుతున్నాడు.

కొంచెం పల్లంలోవుంది, ఆపాక వాన గురిసి ఆ పాకచుట్టూ బురదగావుంది

"పాపాయి! పాపాయి! దొరగారి పాపాయి!" అంటూ రాముడూ, నారాయణా, ఆడపిల్ల మాణిక్యం—సుబ్బలక్ష్మి ముగ్గురు బిడ్డలూ, సంతోషంగా గెంతుకుంటూ, తల్లి వెంట పాకలోకి వచ్చారు—ఏదో ఒక బంగారుకొండనే తల్లియింటికి తెచ్చినట్టు. ఆ పిల్లలవంకచూసి. చంకలో వున్న పసిబిడ్డ ముఖం సంతోషంతో విప్పారింది చిరునవ్వు నవ్వాడు లక్ష్మి ఆ బిడ్డను చంకలో

నుంచి క్రిందికిదించింది దింపీ దింపగానే, ఆబిడ్డ నలువైపులా 'లియజూచాడు ఆ పాకలో సగానికి అడ్డంగా కట్టివున్న తడిక చాటుకుపోయి, తొంగిచూస్తున్నాడు.

"ఏంగావాలి నాన్నా ?" అంది సుబ్బలక్ష్మి.

"బుచ్చా యేదీ ?—"

"బుచ్చాయేమిటి ?—"

"ఈ పాకలో గొడ్డులేవీ — లాగవాయి పొలం తోలు ల్లాలా ?"

"ఇది గొడ్లపాక కాదు నాన్నా ! మనుష లుండేదే - నేనూ, రాముడూ, నారాయణా, చెల్లాయీ, అంతా, యీ పాకలోనే వుంటాం

"ఛా ! అబద్దం - పాకలో ఎక్కడలన్నా మనుషులుంతాలా ? గొడ్డులుంతాయి మను చులు పెంకుతింతో వుంతాలు." ఆ పాక లోనే లక్ష్మి, బిడ్డలూ వుంటారనేమాట వట్టి తెలివితక్కువమాటని ఆ బిడ్డ అభిప్రాయం. తను చాలా తెలివిగలవాణ్ణనీ, లక్ష్మికి తనంత తెలివి లే పోవటంచేతనే, పాకలో మనుష లుంటారని, అజ్ఞానంగా మాట్టాడిందనీ అను కున్నాడు.

"ఏక్కడయూయే ! ఒకమ్మాయికేమీ తెయి య్యేదె — జియ్యాయియే — జియ్యాయియే- పాకలో మన్సులుంతాలుతే !" అంటూ గంతులేస్తున్నాడు.

"నిజం నాన్నా ! మేముండేది ఈ పాక లోనే" అంది లక్ష్మి.

"నిజంగా పాపా ! యిక్కడే మే ముం దేది" అన్నాడు, రాముడు

"నిజం నిజం బువ్వతింతం ఇక్కడే, బబ్బోతం అంతా ఇక్కడే—" అన్నాడు నారాయణ

"తాతాకు బొమ్మలెత్తుకునీ, ఇక్కడే అలు కోతం నువ్వు నాతో ఆడుకుంటావా?" అన్నది చెల్లాయి

"బొమ్మలేవీ?"

మాణిక్యం గుడ్డలుకట్టిన తాటాకుబొమ్మలు తెచ్చి, పాపాయికి చూపిస్తోంది. "ఇదిగో . ఇది మొగుడు ఇది పెల్లాం. పెల్లాత లాల్దామా ?"

"ఆల్దాం ఆల్దాం" తూతుతూ, తూతుతూ, అంటూ, నోటిముందు వ్రేళ్లు కదు పుతూ సన్నాయి వూదుతున్నాడు పాపాయి.

"ఢమ్మ-ఢమ్, ఢమ్మఢమ్" అని పిర్రల మీద డోలు వాయించేస్తున్నాడు, నారాయణ.

పెన్నె పేరంటాలు. మాణిక్యం, పెళ్లి కూతుర్నీ, పెళ్ళికొడుకునీ తడికకు ఆనించి కూర్చోబెట్టి, తల్లిదగ్గిర కెళ్ళింది

"అమ్మా ! బొమ్మలపెళ్ళి చేసుకుంతాం, పప్పులెత్తవ్."

"అన్నంతిని, ఆడుకుందురుగాని, అన్నం పెడుతున్నాను."

మూడు సన్న కంచుకంచం తెచ్చి నట్టింట పరిచింది, సుబ్బలక్ష్మి. అది సరిగ్గా ఒక అర్ధమణుగు బరువుంది. కొయ్యతెడ్డుతో అన్నంకుండలో నుంచి కంచంలోకి తోడు తోంది

"అచ్చిమీ ! పెరుగుకుండలో అన్నం బెత్తావేం ?"

"మేము కుండతోనే అన్నం వండు కుంటాం నాన్నా ! మాకు గిన్నెల్లేవు !"

"ఎందుకనీ ?"

"కొన్లేదు"

"మొన్నా - కంచలి దేలా ఒచ్చిందిగా ఎందుకొక్కన యేదూ ? అమ్మ బోలెలు గిన్నెలు కొంతేనూ"

"అమ్మకు డబ్బుంది గనక అమ్మ కొన్నది. నా దగ్గిర డబ్బేదీ ?"

"అమ్మకి దబ్బుంతే మలి నీకెందుకు యేదూ ?"

"అమ్మకు నాన్నిస్తారు "

"నాన్న నీకియ్యలా ?"

"ఎందుకిస్తారూ ?"

"నాన్న నీ కియ్యకపోతే నే నిత్తాయే అచ్మి !"

"నీకు డబ్బెక్కడిదీ ?"

"నాన్నమల్లే అంత బెద్దవాన్నయీ కాయితాలులాచీ దబ్బు చంపాయిత్తా."

లక్ష్మి చిరునవ్వు నవ్వుకుంది

'మానాయనే ! అప్పుడు కొనిపెడుదువు

గానిలే నేనందాకా బ్రతుకుతానా ?'

సుబ్బలక్ష్మి కంచంనిండా అన్నం పెట్టింది. ఆ యెంగిలిచేత్తోనే పోయి ఉట్టిమీదనుంచి పిడత తియ్యబోయింది—

"ఆయ్! అచ్చిమీ! అదేంటీ!" అని గదమాయించాడు

లక్ష్మి తెల్లబోయి, "ఏమిటి నాన్నా!" అంది

"అంతచేత్తో ఉట్టి ముట్టుకుంటావేం?"-

"ఇంత తెలివిగలవాడివీ ఇందాక మడి గుడ్డలన్నీ ముట్టుకుని దెబ్బలెందుకు తిన్నావూ?"

"నీకు పిచ్చా యేమిటి అచ్చిమీ?— దన్నెంమీదవి మరిబట్టలా? అవి పట్టు బట్టలా యేవిటి? మా అమ్మ నన్ను ఎప్పుడూ ఊరికే అట్టాగే కొట్టుతుంది మా నాన్న అమ్మ నెట్టాకోప్పడ్డాలో చూచావా?"

బిడ్డముందు తల్లిని కోప్పడటమెంత తప్పో, లక్ష్మికి తెలిసింది.

"నాన్న అమ్మని కేకలేశారని, అల్లరి చెయ్యొచ్చు ననుకుంటున్నావా ఏమిటి? నువ్వు ఏడుస్తున్నావని నిన్ను సముదాయించటానికి, నవ్వటాలకి నాన్న అమ్మనలా కేకలేశారు. అల్లరి చేస్తే నాన్న ఊరుకుంటారనుకుంటున్నావా?

"చయ్యే ముందుచెయ్యి కడుక్కుయ్యా-మయ్యా ఉట్టిముట్టుకో బోతున్నావేం? నీకు పిచ్చా యేమితీ?"

చెయ్యి కడుక్కోకుండా ఉట్టి ముట్టుకుంటే ఆపిల్లదు ఊరుకోడు దొడ్లోకిపోయి చెయ్యి కడుక్కొచ్చింది.

వాసినకట్టిన ముంతలోనుంచి సంబారు కారం తీసి, కంచంలోవేసి ముద్ద కలుపుతోంది అనువాసన. ఘుమఘుమా పాకంతా చుట్టేసింది వస్తూవస్తూ, కడుపునిండా పెరుగూ అన్నం తినేవచ్చాడు ఇంచేత, ఇంతసేపూ, అన్నంతినే ధోరణిలో లేడు. దూరంగా కూర్చుని, కబుర్లు కొడుతున్నాడు. కాని అనువాసన అతణ్ణి ఆకర్షించింది. తెలుగుదేశంలోవున్న బీదజనమంతా యీ ఒక్క ఆదరువుతోనే కాలక్షేపం చేస్తారు. బ్రాహ్మణ కుటుంబాల్లో నుటుకు ఎందుకనో దీన్ని వాడరు. తక్కిన శూద్రులంతా వాడే యీ పదార్థం తామూ వాడితే ఒకవేళ బ్రహ్మత్వం పోతుందనో యేమిటో!

పిల్లలంతా, కంచంచుట్టూ మూగారు. అంతా ఒక్క కంచంలోనే తింటున్నారు తల్లి తలో ముద్దా చేతుల్లోబెట్టి, తనూ తింటోంది. పాపకూడా, నెమ్మదిగా, దగ్గిరికి చేరాడు అరచెయ్యి చాపాడు. ఎర్రటి, ఆచిట్టి అరచేతిలోకి, బంగారుగాజు ముందుకు పడి, తొంగిచూస్తోంది.

"ఏమిటి నాన్నా!" అంది లక్ష్మి

"అం పెత్తూ"

"ఎబ్బే"

"ఏంతీ?"

"నువ్వు నాదగ్గిర అన్నం తినగూడదు"

"లాములు తింతున్నాలేం మలీ?"

"వాడు తినొచ్చు"

"వాలు తింతే నే నెందుకు తినగోల్దూ?"

లాములు తింతే నేనూ తింతా పెత్తుతావా పెత్తవా? మీ కెవ్వలికీ యేకుందా, అంతా నేనే యాక్కుంతా నాగంది"— కంచంమీద కలియబడుతున్నాడు.

"ఆ! ఆ! ఆగాగు" అంటూ చెయ్యి అడ్డుబెట్టింది

"ఆ! అంతచేత్తో ముట్టుకున్నావంటేనా! అందయ్యాముట్టుకుని మైలపడేత్తా నమ్మాయ్! ఏంతనుకున్నావో! నాకూ పెత్తాయిచిందే"—అంటూ ఆపినా ఆగకుండా కంచంమీద కలియబడుతున్నాడు

ఆ బిడ్డ పట్టినపట్టు వదిలేరకం కాదు ఆ సంగతి లక్ష్మికి బాగా తెలుసు. ఏమి చెయ్యటానికి లక్ష్మికి తోచలేదు కొంచెం గదమాయించిచూదామనుకుంది

"ఆయ్! చెబుతుంటే వినవేం?" అని బిగ్గిరిగా కసిరింది.

పాపాయి రెండుగుడ్లనిండా నీళ్ళు తిరిగాయి. నెమ్మదిగా కంచం దగ్గిరనుంచి దూరంగా వచ్చేసి, తడికను ఆనుకుని శోక

మూర్తిలా దిగులుగా నిల్చున్నాడు.

ఎవరన్నా తన్నులా కసిరితే, లక్ష్మని కావిలించుకుని, పెద్దపెట్టున యేడ్చేసి, మారాం వేసేవాడు. లక్ష్మతన్ని కేకలేస్తే ఇంకేంజేస్తాడు పెదవులు వణికిపోతున్నయ్. నల్ల నీలాలు చెక్కిళ్ల దిగజారుతున్నయ్ లోలోపల కుములుతున్నాడు

ఆ బిడ్డవంక చూసి. లక్ష్మి కడుపు తరుక్కు పోయింది. మద్ద నోట్లో బెట్టుకో లేక పోయింది "మీరు తినండర్రా!—బిడ్డ యేడుస్తున్నాడు" అని కంచం దగ్గరనుంచి లేచి, దొడ్లోకి పోయి, చెయ్యి కడుక్కు వచ్చేసింది. పాపాయిని ఒళ్ళోకి తీసుకుంది. "వెధవ కూడూ బిడ్డ హైరానైపోయాడు" అనుకుంటూ—

"పోనీ, తాయి తాగుతావునాన్నా!"

"నాకేమీ అక్కర్యేదుయే" అంటూ మూతిముడుచుకున్నాడు. లక్ష్మికి ప్రపంచమే చిన్నబుచ్చుకుంటున్నట్లనిపించింది. "బిడ్డను ఎలా సముదాయించను"—అని ఆతల్లి జాలి పేగులు కళవళపడుతున్నయ్

"నా అన్నం, నువ్వు తినగూడదునాన్నా' నాఖర్మ పట్టెడు ముద్ద నీ బంగారుచేతులలో బెట్టుకునే గీత నాకీజన్మలోలేదూ— నాకులం, నీకులం ఒకటికాదునాన్నా! యేం చెయ్యమంటావు చెప్పు"—మునివ్రేళ్ళ చివరలు అలిగిన ఆ పసిచుబుకాన్ని బ్రతిమిలాడుతున్నయ్

కులమంటే యేమిటో ఆ పసిబిడ్డకు అర్థం కాలేదు. తనకూ, సుబ్బలక్ష్మికీ మధ్య ఏదో నల్లటి ఉక్కు తెర ఒకటి దిగుతోందనిపించింది. సుబ్బలక్ష్మి ఒళ్ళోనుంచి తన్నెదో ఒక పిశాచం బలవంతాన ఎక్కడికో చీకట్లోకి పడలాక్కు పోతున్నట్లు భయమేసింది, ఆ పసికందుకు

"కుయ మేమితి అచ్చిమీ? నా జతుం దవా?" — బెంగగా వణికిపోతున్న జాలి గొంతుతో దీనంగా అడిగాడు—"పోనీయే" ముంజేతుల్తో రెండుకళ్లూ నలుపుకుని, బిగ్గిరిగా యేడ్చేశాడు చెలియలికట్టలు తెగి పోతున్నయ్.

లక్ష్మికికూడా కళ్ళు చెమ్మగిల్లాయి. ఆపసి కూన పలుకులు ఆతల్లి పేదగుండెల్ని, జాలిగాపిలిచి కలచినట్టయింది. ఆతల్లి, భరించ లేకపోయింది. ఉద్రేకంతో పెదవులు కదిలి పోతున్నయ్—

"ఛీ! ఛీ! వెధవకులాలూ, వెధవ మతాలూనూ!—కసుగందుల లేతగుండెల్నికూడా కత్తికోతగా చీరాలిసొచ్చింది!" అని విసుగ్గా గొణుక్కుంది.

"అట్టా, మా అన్నం నీకు పెట్టగూడదు నాన్నా' నీకు తెలియదూ మా తండ్రి గదూ నేను పి లక్ష్మని కానూ నామాట వినవ్?—" అంటూ, దీనంగా, ఆబిడ్డ కళ్లల్లోకి చూసింది. ఏమీ చెయ్యలేని, తన అసమర్థత నంతా, ఆ జాలిచూపుతో ఆపసి హృదయానికి చెప్పుకుంది. తన మాతృహృదయమంతా విప్పిచూపి "తెలుసుకోవూ?" అంటూ ఆపసి గుండెల్ని నిశ్శబ్దంగా బ్రతిమిలాండింది

ఆబిడ్డ ఏడుపు నెమ్మది నెమ్మదిగా తగ్గితగ్గి పోతూంది వెకిలిగ్గిరిగా ఏడవటం మానేశాడు కాని లోలోపల కుములుతున్నాడు అల్లా బలవంతాన దుఃఖం మింగుకోటం చేత. సూత్రం తెగిన ముత్యాలపేరులా కన్నీరు ఒలికొలికిపోతూంది. గుబులు గుబులుగా ఎక్కిళ్ళు. పైట్ట చెంగుతో కళ్ళు ఒత్తింది లక్ష్మి. గట్టిగాహృదయానికి హత్తుకుని ఆపసి గుండెల్ని తనలోకి లయించుకుంటోంది.

ఆబిడ్డ, గుబులుగుబులుగా, లోలోపల కుమిలి కుమిలి యేడుస్తూ ఆ తల్లిఒళ్ళో, "అలాగే నె"మ్మని'కన్నుమూశాడు. మధ్య మధ్య ఎక్కిళ్ళు వినిపిస్తున్నయ్.

నిద్రపోతున్న ఆ పసికూన నెమ్మిమీద చెయ్యివేసి ఆప్యాయంగా నిమిరింది లక్ష్మి. ఆ బిడ్డ ఒళ్ళు, పేలగింజ వేస్తే పేళ్ళు మనేట్టు కణకణా కాలిపోతోంది. లక్ష్మి కలవరపడ్డది. "అయ్యయ్యో! ఇదేమిటి బిడ్డకు కొండలపెట్టున జ్వరంకూడా వచ్చేసింది!"

"కుయమంతే యేవితి యచ్చీ!" బిడ్డ నిద్రలో కలవరిస్తున్నాడు.